ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
గురువారం 19 జూన్ 2025



యోగా కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల, జూన్ 18(ఆంధ్రజ్యోతి):అంబేడ్కర్ యూనివర్సిటీలో యోగా కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాది పీజీ, ఆరు నెలల డిప్లొమ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. డిగ్రీ అర్హత గల వారు పీజీ కోర్సులో, ఇంటర్మీడియట్ అర్హతతో డిప్లమో కోర్సులో చేరవచ్చన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు రిజిస్ట్రార్, డాక్టర్ బీఆర్ఏయూ పేరిట రూ.200 ఆన్‌లైన్‌లో చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం ఈ విభాగం సమన్వయ కర్త కేవీఎస్ మూర్తి (96036 99414)ని సంప్రదించాలని అన్నారు.

తలకెక్కించుకోవట్లే!





- ప్రభుత్వ ఆదేశాలు పాటించని ద్విచక్ర వాహనచోదకులు
- హెల్మెట్ ధరించకుండానే ప్రయాణాలు
- ప్రమాదాలతో ప్రాణాలు కోల్పోతున్న వైనం
- రెండేళ్లలో 579 మంది మృత్యువాత

- ఈ ఏడాది ఏప్రిల్ 6న ఎచ్చెర్ల మండలం చిలకపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. శ్రీకాకుళం నగరానికి చెందిన దీర్గా కార్తీక్, పండా తరుణ్ అనే యువకులు బైక్‌పై వెళ్తూ డివైడర్‌ను ఢీకొట్టారు. హెల్మెట్ ధరించకపోవడంతో తలలు పగిలి ఇద్దరూ చనిపోయారు.
- గత నెల 17న సారవకోట మండలం బురదకొత్తూరు గ్రామానికి చెందిన జరజాన సమీర్ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సమీర్ మరోవ్యక్తితో కలిసి బైక్‌పై హిరమండలం వెళుతుండగా గెడ్డయ్యపేట వద్ద లారీని ఢీకొట్టాడు. హెల్మెట్ ధరించకపోవడంతో సమీర్ ఘటనాస్థలంలోనే మృతిచెందాడు. వెనుక కూర్చున్న మరో వ్యక్తి తీవ్ర గాయాలతో బయటపడ్డాడు.



ఇచ్ఛాపురం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించాలని పోలీసులు, అధికారులు పదేపదే చెబుతున్నా మారి మాటలను కొందరు ద్విచక్ర వాహన చోదకులు తలకెక్కించుకోవడం లేదు. హెల్మెట్ పెట్టుకోకుండానే ప్రయాణాలు సాగిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. దీని వల్ల కొందరు మృత్యువాత పడుతుండగా, మరి కొందరు క్షతగాత్రులుగా మారుతున్నారు. మృతుల్లో యువకులే అధికంగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా జాతీయ రహదారిపై ఏదో చోట ప్రమాదం చోటుచేసుకోవడం, ప్రాణాలు కోల్పోవడం పరిపాటిగా మారింది.

రెండేళ్లలో 1,684 ప్రమాదాలు..

జిల్లా వ్యాప్తంగా గత రెండేళ్లలో 1,684 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. 2023లో 810 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 297 మంది చనిపోయారు. 2014లో 874 ప్రమాదాలు చోటుచేసుకోగా 282 మంది మృతి చెందారు. ఆ రెండేళ్లలో 1,925 మంది క్షతగాత్రులయ్యారు. ఎక్కువ మంది హెల్మెట్ ధరించకపోవడం వల్లే ప్రమాదాల్లో చనిపోయినట్టు తెలుస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. అలాగే, పరిమితికి మించి ప్రయాణాలు చేయడం, అతివేగం (మిగతా 6వ పేజీలో..)



పఠనం..
నడిపించే ఇంధనం
- పుస్తకాలు.. పత్రికలతో విజ్ఞానం
- నేడు జాతీయ పఠన దినోత్సవం
6లో

నేడు షర్మిల రాక
- జిల్లాలో పర్యటించనున్న పీసీసీ అధ్యక్షురాలు
7లో

అవినీతికి పాల్పడితే
వేటు తప్పదు
- ఆదిత్య ఆలయ ఈవో
7లో

గ్రంథాలయంపై అసత్య ప్రచారాన్ని నమ్మవద్దు: జేసీ
7లో

అక్రమాలు కొండంత..
చర్యలు గోరంత

- ఇదీ జగతిమెట్ట జగనన్న కాలనీలో పరిస్థితి
- 150 వరకు అక్రమ పట్టాల గుర్తింపు
- రద్దు చేసింది 40 మాత్రమే
- మరో 18 పునాదులు తొలగింపు
- కీలక రికార్డులు మాయం
- కారకులైన అధికారులపై చర్యలు శూన్యం

టెక్కలి మండలం జగతిమెట్ట జగనన్న ఇళ్ల కాలనీ అక్రమాల పుట్టగా తయారైంది. ఈ కాలనీలో వేసిన లేఅవుట్లు, పట్టాల కేటాయింపు ఇలా అన్నింట్లో కూడా భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఇష్టారాజ్యంగా పొజిషన్ సర్టిఫికెట్లను జారీ చేశారు. రూ.లక్షలకు వాటిని అమ్ముకున్నారు. కీలకమైన రికార్డులు మాయమయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీకి కొందరు నాయకులు, కొందరు రెవెన్యూ అధికారులు అక్రమాలకు పాల్పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇవన్నీ బయటపడ్డాయి. కానీ, ఏడాది అవుతున్నా చర్యలు మాత్రం నామమాత్రమే. దీంతో అక్రమాలు కొండంత, చర్యలు మాత్రం గోరంత అన్న చందంగా పరిస్థితి ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.



జగతిమెట్ట జగనన్న ఇళ్ల కాలనీ

టెక్కలి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీ కోసం టెక్కలి దరి జగతిమెట్ట సమీపంలో సర్వేనెం.288, 289లో సుమారు 12 ఎకరాల డీ.పట్టాను అధికారులు సేకరించారు. శ్యామసుందరాపురానికి చెందిన 40మంది రైతులకు చెందిన ఈ భూమిని ల్యాండ్ ఎక్విజేషన్ ద్వారా సేకరించారు. వీరికి నగదు చెల్లింపులు కూడా జరిగాయి. అలాగే, వీరికి ఒక్కో ఇంటి పట్టాను అందించాల్సి ఉంది. కానీ, అధికారులు మాత్రం 40మందికి బదులు 70 మంది రైతుల పేర్లు సృష్టించి వారికి పట్టాలు అందించారు. ఇళ్ల పట్టాల కేటాయింపుల్లో కొందరు రెవెన్యూ అధికారులు చేతివాటం ప్రదర్శించి దొరికినకాడికి దోచుకున్నారు. అప్పటి అధికార పార్టీకి చెందిన కొందరి ప్రజాప్రతినిధుల సిఫారసులతో ఇష్టారాజ్యంగా ఇళ్ల పట్టాలు జారీచేయడం, పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయడం చేశారు. అప్పట్లో కొందరు వైసీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు దళారీల అవతారం ఎత్తారు. రోడ్డుకు ఆనుకుని ఉన్న ఇళ్ల పట్టాలను భారీ ధరలకు అమ్మకాలు చేశారు. ఈ కాలనీలో 389 లేఅవుట్లకు అనుతులు ఉంటే 420 వెలిశాయి. 150 వరకు భోగస్ పట్టాలు మంజూరు చేశారు.

మంత్రి ఆదేశించినా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుక్షణమే జగతిమెట్ట జగనన్న కాలనీలోని అక్రమాలను వెలికితీయాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి ఆ బాధ్యతలను మంత్రి అప్పగించారు. దీంతో ఆర్డీవో విచారణ చేపట్టారు. భూములు ఇచ్చిన రైతులు 40మంది అయితే 70మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చినట్లు గుర్తించారు. అలాగే 389 లేఅవుట్లకు బదులు 420 లేఅవుట్లు ఉన్నట్లు గుర్తించారు. 150 వరకు భోగస్ పట్టాలు ఉన్నట్లు తేల్చారు. ఈ లేఅవుట్లలో 70వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇక్కడ పొజిషన్ సర్టిఫికెట్లను రూ.లక్షలకు కొనుక్కొని ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టిన వారు వందల సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తుంది. కానీ, అధికారులు మాత్రం కేవలం 18 ఇళ్ల పునాదులను తొలగించి మమ అనిపించారు. అలాగే, 40 బోగసు పట్టాలు రద్దు చేసి చేతులు దులుపుకొన్నారు.

రెవెన్యూ సిబ్బందిపై చర్యలేవీ?

ఆర్డీవో దర్యాప్తులో చాలా విషయాలు బయటపడ్డాయి. రెవెన్యూ అధికారులు మొదలుకొని సిబ్బంది వరకు సూత్రదారులు, పాత్రదారులుగా ఆయన (మిగతా 6వ పేజీలో)

తల్లులకు షాక్

- ఒకే ఆధార్ నెంబర్‌కు పదుల సంఖ్యలో విద్యుత్ సర్వీసుల అనుసంధానం
- తప్పుడు సీడింగ్‌తో 'తల్లికి వందనం' దూరం
- లబోదిబోమంటున్న నిరుపేద కుటుంబాలు





'తల్లికి వందనం' డబ్బులు రాలేదని చెబుతున్న జింకిభద్ర గ్రామానికి చెందిన పైల కుమారి

కంచిలి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం నిరుపేద కుటుంబాల పాలిట శాపంగా మారింది. వారి తప్పిదంతో చాలామంది పేద పిల్లలు తల్లికి వందనం పథకానికి దూరమయ్యారు. ఒకే ఆధార్ నెంబర్‌కు పదుల సంఖ్యలో విద్యుత్ సర్వీసులను అనుసంధానం చేయడంతో అనేక మంది తల్లికి వందనం పథకాన్ని కోల్పోయారు. సోంపేట మండలం జింకిభద్ర గ్రామానికి చెందిన పైల చందనం, కుమారికి ఇద్దరు పిల్లలు. హాసిని ఇంటర్ ద్వితీయ సంవత్సరం, కార్తీక్ జింకిభద్ర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. వీరికి డాబా ఇల్లు ఉంది. ఇంటిలో రెండు ఫ్యాన్‌లు, రెండు బల్బులతోపాటు ఒక టీవీ ఉంది. ప్రతి నెలా కరెంట్ చార్జీలు నామమాత్రంగానే వస్తున్నాయి. కానీ, తల్లికి వందనం పథకం డబ్బులు కుమారి బ్యాంకు ఖాతాలో పడలేదు. ఉసూరంటూ ఆమె తన పిల్లల విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డులు పట్టుకుని గ్రామంలోని సచివాలయానికి వెళ్లి, అధికారులను ప్రశ్నించింది. అక్కడ వారు కుమారికి చెందిన ఆధార్‌కార్డుతో మరో 70 విద్యుత్ (మిగతా 6వ పేజీలో)

మూడో రైల్వే లైన్‌కు గ్రీన్‌సిగ్నల్

- విశాఖపట్నం-ఖుర్దారోడ్ మధ్య ఏర్పాటుకు ఆదేశాలు
- శరవేగంగా భూసేకరణ
- రైళ్ల రాకపోకలకు తప్పనున్న ఇబ్బందులు



పలాస-ఇచ్ఛాపురం మార్గంలో ఉన్న రెండు లైన్లు

పలాస, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఇక నుంచి ఇలాంటి ఇబ్బందులు ఉండవు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే భువనేశ్వర్ కేంద్రంగా విశాఖపట్నం నుంచి ఖుర్దారోడ్ వరకూ మూడో రైల్వే లైన్ ఏర్పాటుకు రైల్వేశాఖ పచ్చ జెండా ఊపింది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు ఫిబ్రవరిలోనే జరగ్గా, ప్రస్తుతం రెండు డివిజన్ పరిధిలో ఉన్న కలెక్టరేట్లకు స్పష్టమైన ఆదేశాలు అందాయి. కొత్త రైలు మార్గం ఏర్పాటుకు అవసరమయ్యే భూ సేకరణ, చెల్లించాల్సిన నష్టపరిహారం, ఆ మార్గంలో రైల్వే స్థలాలు ఉన్నాయా? లేదా? పరిశీలించి నివేదిక సిద్ధం చేయాలని రెవెన్యూశాఖకు ఆదేశాలు అందాయి. ఈ ఏడాది సెప్టెంబరు నెలాఖరు నాటికి భూ సేకరణ పూర్తికావాలని లక్ష్యం పెట్టారు. ఈ మేరకు నెల రోజుల నుంచి ఇచ్ఛాపురం నుంచి పలాస సెక్షన్ల పరిధిలో మొత్తం భూ వివరాలు సేకరించే (మిగతా 6వ పేజీలో)

- రెండేళ్ల కిందట ఒడిశాలోని బాలాసూర్ రైల్వే స్టేషన్ వద్ద ప్రమాదం జరిగింది. ఫలక్‌నుమాను గూడ్స్‌రైలు ఢీకొంది. దీంతో మొత్తం అప్, డౌన్ లైన్లలో పట్టాలన్నీ ధ్వంసమయ్యాయి. దీనివల్ల రోజంతా రైళ్లరాకపోకలు ఆలస్యమయ్యాయి. పట్టాలు సరిచేసిన తరువాతే సాధారణ రైళ్లు నడిచాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేకపోయారు.

25 లక్షల మొక్కలు నాటడం లక్ష్యం

- డీఎఫ్‌వో వెంకటేశ్వరరావు



అధికారులతో సమీక్షిస్తున్న డీఎఫ్‌వో

నరసన్నపేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జిల్లాలో వర్షాకాలంలో 25 లక్షల మొక్కలను నాటేందుకు చర్యలు చేపడుతున్నామని జిల్లా అటవీశాఖ అధికారి బి.వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆ శాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కల సంరక్షణ బాధ్యతను వివిధ పరిశ్రమలకు అప్పగిస్తున్నామన్నారు. సామాజిక అటవీ పెంపకంపై ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. 62 నర్సరీల ద్వారా వచ్చే ఏడాదికి 40 లక్షలు మొక్కలు ప్లాంటేషన్ చేపడతామన్నారు. కార్యక్రమంలో సబ్‌డివిజన్ అటవీశాఖ అధికారి నాగేంద్ర, ఫారెస్ట్ రేంజర్లు జగదీష్, రాజశేఖర్, సిబ్బంది వెంకటేష్, శ్రీనివాసరావు, నాగేంద్ర, జనప్రియ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను పెంచండి..
చెట్లను నరకండి

- ఇదీ నగరంలో ప్రభుత్వ శాఖల తీరు
- ఓవైపు సందేశాత్మక చిత్రాలు.. మరోవైపు యథేచ్ఛగా చెట్ల తొలగింపులు



6లో

పఠనం.. నడిపించే ఇంధనం

- పుస్తకాలు.. పత్రికలతో విజ్ఞానం
- నేడు జాతీయ పఠన దినోత్సవం



సాంకేతికత ఎంత పెరిగినా.. సమాచారం ఎంతగా అరచేతిలోకి వచ్చేస్తున్నా.. 'పఠనం' వల్ల కలిగే ప్రయోజనాన్ని తగ్గించలేవు. పుస్తకాలు.. పత్రికల పఠనం ద్వారా వచ్చే విజ్ఞానాన్ని తూకం వేయలేం. ప్రపంచంలో అత్యున్నత స్థానాలలో ఉంటున్న వారంతా తమ విజయంలో పఠనమే కీలకం అని చెబుతున్న సందర్భాలు ఎన్నో. సెల్‌ఫోన్ ఎంత సమాచారాన్ని ఇస్తున్నా.. ఇప్పటికీ పుస్తక పఠనంపై ఆధారపడేవారు ఎందరో. నేడు జాతీయ పఠన దినోత్సవం సందర్భంగా.. పఠనం ప్రాముఖ్యాన్ని.. పఠనాన్ని వ్యసనంగా మార్చుకున్న కొందరి గురించి తెలుసుకుందాం.


శ్రీకాకుళం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): 'పఠనంతోనే జ్ఞానం, విజ్ఞానం వస్తుంది. చదవండి... అభివృద్ధి చెందండి' అనే కార్యక్రమాన్ని ప్రోత్సహించాలని ప్రధాని నరేంద్రమోదీ ఇటీవల పిలుపునిచ్చారు. 'బుక్స్ ఆర్ విండో ఆఫ్ వరల్డ్' అనే నానుడి ఉంది. దీన్ని బట్టి పఠనం ప్రయోజనమేంటో తెలుసుకోవచ్చు. పఠనంతో జ్ఞానం రావడమే కాకుండా సమాచార నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి. దీని ప్రాధాన్యాన్ని తెలియజెప్పేందుకే 'జాతీయ పఠన దినోత్సవాన్ని' నిర్వహిస్తున్నారు.

ఎలా వచ్చిందంటే..

జాతీయ పుస్తక పఠన దినోత్సవాన్ని భారత గ్రంథాలయ ఉద్యమ పితామహుడు పుతువాయిల్ నారాయణ పనికర్ వర్ధంతి రోజైన జూన్ 19న నిర్వహిస్తున్నారు. ఇది 1996 నుంచి ఆరంభమైంది. కేరళలో అక్షరాస్యత పెంపొందించే దిశగా ఆయన గ్రంథాలయాలు స్థాపించి పఠన ఆవశ్యకత ఉద్యమం చేపట్టారు. ఆయన 1995 జూన్ 19న తుదిశ్వాస విడిచారు. ఈ తేదిని జాతీయ పఠన దినోత్సవంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

గ్రంథాలయాలతో మేలు

ప్రస్తుతం ఆధునిక సాంకేతిక యుగంలో మొబైల్, కంప్యూటర్‌లదే ఆధిపత్యం. పుస్తక పఠనం ప్రయోజనాలను వివరించాల్సిన తరుణమిది. పుస్తకాలు చదవడం వల్ల విజ్ఞానం, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి వృద్ధి తదితర ప్రయోజనాలను వివరించడమే లక్ష్యంగా జాతీయ పఠన దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఇందుకు గ్రంథాలయాలు ప్రత్యేక పాత్రను పోషిస్తున్నాయి. యువత గ్రంథాలయాలను వినియోగించుకుంటే ఎంతో విజ్ఞానాన్ని సముపార్జించవచ్చు.



పుస్తకం చదువుతున్న కోట చిన్నబాబు

చిన్నబాబు పుస్తకప్రియుడు

- 105 ఏళ్ల వయస్సులోనూ పుస్తక పఠనం

టెక్కలి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఈయన పేరు కోట చిన్నబాబు. వయస్సు 105 సంవత్సరాలు. పాత జాతీయ రహదారిలోని టీఎస్‌జేఆర్ హైస్కూల్ దరి కేసీబీ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. ఈయనకు అనునిత్యం పుస్తకాలు చదవడం అలవాటు. రామాయణం, మహాభారతం, భగవద్గీత, ఆధ్యాత్మిక, మహనీయుల పుస్తకాలు, వేమన శతకాలు చదవడంతో పాటు ప్రముఖ దినపత్రికలను కూడా రోజూ చదువుతుంటారు. ఈ వయస్సులో కూడా ఆయన పుస్తక పఠనం చేయడం విశేషం. ఆయన అభిరుచికి తగ్గట్టుగా కుమారుడు మురళీధర్ ఆయనకు అవసరమైన పుస్తకాలు, పత్రికలను అందిస్తుంటారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ పుస్తకంలోనే విజ్ఞానం దాగి ఉందని... అందుకే ఇప్పటికీ చదువుతుంటానని చెప్పారు.

నేస్తాలను అందించాయి..



శ్రీకాకుళం కల్చరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నా చిన్నతనంలో డెల్ కార్నియా రాసిన 'హౌ టు విన్ ఫ్రెండ్స్' అనే పుస్తకం చదివా. స్నేహభావాన్ని మించిన సద్గుణం మరొకటి లేదని బోధించిన పుస్తకం అది. అనేక మంది స్నేహితులను ఆ ఒరవడిలో నేను పొందగలిగాను. చిన్నప్పటి నుంచి పుస్తక పఠనం పట్ల అత్యంత ఆసక్తి ఉండేది. తెలుగు, ఆంగ్ల పత్రికలను చదవడం అలవాటు. అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' వారపత్రికకు జోక్స్ పంపించే వాడిని. అవి ప్రచురితమైతే మహదానంద పడేవాడిని. ఈ రోజు అనేక సభల్లో వ్యాఖ్యాతగా వ్యవహరిస్తూ ఏ విషయాన్నైనా సమగ్రంగా చెప్పగలిగే అవకాశం పుస్తక పఠనమే అందజేసిందని కచ్చితంగా చెప్పగలను. పుస్తక పఠనం పట్ల ఈ రోజు సమాజంలో ఆసక్తి సన్నగిల్లుతూ ఉండటమే కొందరి అనైతిక ప్రవర్తనలకు కారణమేమోనని అనిపిస్తుంది.

-వావిలపల్లి జగన్నాథంనాయుడు, అదనపు కన్వీనర్ ఇంటాక్, శ్రీకాకుళం

పుస్తకాలతో విజ్ఞానం..



నాకు చిన్నప్పటి నుంచి పుస్తకాలు చదవడం అలవాటు. చిన్నప్పుడు వేమన చరిత్ర, గురజాడ అప్పారావు నాటకాలు, పుస్తకాలు, గిడుగు రామ్మూర్తి పంతులు రచనలు చదివేవాడిని. నాకు కూడా కవితలు, కథలు రాయాలని ఆలోచన కలిగేది. గ్రంథాలయానికి వెళ్లేవాడిని. ఆ తరువాత తెలుగు భాష అంటే మక్కువ ఉపాధ్యాయుడిని అవ్వాలని కోరిక ఉండేది. ఆ లక్ష్యం నెరవేర్చుకున్నాను. ప్రస్తుతం తెలుగు రచయితల వేదిక అధ్యక్షునిగా ఉన్నాను. కేంద్ర గ్రంథాలయానికి నిత్యం వెళ్తున్నాను. ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవడం వల్ల ఎంతో విజ్ఞానాన్ని పెంచుకోవచ్చు.

-ఉత్తరావల్లి నాగేశ్వరరావు, శ్రీకాకుళం

ఇప్పటికీ చదువుతున్నా..



నేను చిన్నప్పుడు రామానుజన్ పుస్తకాలు చదివి.. గణిత ఉపాధ్యాయుడిని కావాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. మరోవైపు తెలుగు భాష మీద మక్కువతో కవితలు, పద్యాలు రాస్తుంటాను. ప్రస్తుతం గణిత ఉపాధ్యాయునిగా విశ్రాంతి పొందినా... తెలుగు రచయితల వేదికలో ప్రధాన కార్యదర్శిగా ఉంటూ భాషాభివృద్ధికి పాటుపడుతున్నాను. చిన్నప్పటి నుంచి గ్రంథాలయాలకు వెళ్లి... పుస్తకాలు చదివేవాడిని. ఇప్పటికీ కేంద్ర గ్రంథాలయానికి వెళుతూ పుస్తకాలు చదువుతున్నాను.

-ఆర్.వి.రమణమూర్తి, శ్రీకాకుళం

పుస్తక పఠనం ఎంతో ఇష్టం..



రణస్థలం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నాకు పుస్తక పఠనం అంటే చాలా ఇష్టం. చదువుకున్నది ప్రాథమిక విద్యలోపే అయినా..చిన్నప్పటి నుంచి పుస్తకాలు చదవడంపై చాలా ఆసక్తి. గతంలో నవలలు, కథలు ఇష్టంగా చదివే వారం. యండమూరి వీరేంద్రనాథ్, యద్ధనపూడి సులోచనరాణిల నవలలు, విపుల, చతుర, స్వాతి వంటివి సైతం చదివేవారం. పుస్తక పఠనంతో చాలా విషయాలను తెలుసుకునేవాళ్లం. విషయ పరిజ్ఞానం వచ్చేది. కథల వల్ల మంచి చెడులు తెలిసేవి. ఇప్పుడు పిల్లల్లో పుస్తక పఠనంపై ఆసక్తి తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. చిన్న విషయానికి కూడా సెల్‌ఫోన్‌పై ఆధారపడుతున్నారు. అందుకే పిల్లల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంచేందుకు పెద్దలు ప్రయత్నించాలి.

-వెలిచేటి సరస్వతమ్మ, బంటుపల్లి

'తల'కెక్కించుకోవట్లే!

(ఐదో పేజీ తరువాయి)

సెల్‌ఫోన్ డ్రైవింగ్, మైనర్ల వాహనాలు నడపడం వంటి కారణాలతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

చట్టాలు కఠినం చేసినా..

ఈ ఏడాది మార్చి 1 నుంచి హెల్మెట్ ధారణకు సంబంధించి కీలక ఆదేశాలు వచ్చాయి. కోర్టు తీర్పు నేపథ్యంలో కఠిన నిబంధనలు, జరిమానాలు అమల్లోకి వచ్చాయి. అయినా సరే వాహనదారుల్లో మార్పురాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. మార్చి1 కంటే ముందు హెల్మెట్ లేకుండా ప్రయాణానికి సంబంధించి రూ.135 జరిమానా వేసేవారు. ప్రస్తుతమైతే రూ.1000 కట్టాల్సిందే. లైసెన్స్ లేకుండా బండి నడిపితే రూ.10 వేలు వసూలు చేస్తారు. విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ సిబ్బందితో వాగ్వాదానికి దిగితే కేసులు నమోదుచేస్తారు. 90 రోజుల్లో జరిమానా కట్టకపోతే బండి సీజ్ చేస్తారు.

అపరాధ రుసుం ఇలా..

హెల్మెట్ లేకుంటే రూ.వెయ్యి, వెనుక కూర్చున్న వారు హెల్మెట్ ధరించకపోతే రూ.వెయ్యి, బైక్‌కు ఇన్సూరెన్స్ లేకపోతే రూ.వెయ్యి, రెండోసారి పట్టుబడితే రూ.2వేలు, భారీ సైలెన్సర్లతో సౌండ్ పొల్యూషన్‌కు పాల్పడితే రూ.2వేలు, అదే రెండోసారి దొరికితే రూ.4వేలు, పరిమితికి మించి వాహనాల్లో ఎక్కించుకుంటే మనిషికి రూ.200 లెక్క జరిమానా విధిస్తారు. మైనర్లు డ్రైవింగ్ చేసి పట్టుబడితే రూ.వెయ్యి, నిషేధం ఉన్న ప్రాంతాల్లో పార్కింగ్ చేస్తే రూ.1500 నుంచి రూ.2వేలు, బైక్ రేసుల్లో పాల్గొంటే రూ.5వేలు, రెండోసారి అందులో దొరికితే రూ.10వేలు, తాగి వాహనం నడిపితే మూడు నెలల జైలుశిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తున్నారు. కానీ ప్రజల్లో మాత్రం మార్పురావడం లేదు.

తప్పనిసరి ధరించాలి..



ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు తప్పకుండా హెల్మెట్ పెట్టుకోవాలి. కార్లపై వెళ్లేవారు సీటు బెల్టు పెట్టుకోవడం తప్పనిసరి. నిబంధనలు పాటించకపోతే భారీ జరిమానా, జైలుశిక్ష తప్పదు. ప్రజల బాగుకోసమే ఈ ప్రయత్నం. ప్రజలు సహకరించాలి. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి.

-మీసాల చిన్నమనాయుడు, సీఐ, ఇచ్ఛాపురం

తల్లులకు 'షాక్'

(ఐదో పేజీ తరువాయి)

సర్వీసులు అనుసంధానం అయినట్టు చెప్పడంతో అవాక్కు అవ్వడం కుమారి వంతైంది. తనకేమి అపార్టుమెంట్లు లాంటివి లేవని, తాను నిరుపేదనని, ఇన్ని విద్యుత్ మీటర్లు తన నెంబరుకు ఎలా అనుసంధానం చేస్తారంటూ అధికారులను నిలదీసింది. మీరు చేసిన తప్పుకు ప్రభుత్వం తన పిల్లలకు అందిస్తున్న సాయం అందకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. తన నెంబరుతో అనుసంధానం చేసిన సర్వీసులను తొలగించాలని ఫిర్యాదు చేసింది. అయితే కుమారి ఆధార్ నెంబర్‌కు అనుసంధానమైన 70 విద్యుత్ మీటర్లకు చెందిన వారి ఆధార్‌కార్డులు తెస్తే, పని జరుగుతుందని చెప్పడంతో కుమారి ఆగ్రహం వ్యక్తం చేసింది. మీ డిపార్ట్‌మెంట్ వాళ్లు చేసిన తప్పు వల్ల తాను నష్టపోయానని, దాన్ని సరిదిద్దాల్సిన అధికారులు తనకు 70 మీటర్లకు సంబంధించిన వారి ఆధార్‌కార్డులు తెమ్మనడం ఎంతవరకు సమంజసమని నిలదీసింది. అయినా అధికారులు రూల్స్ ఇలానే ఉన్నాయి, తామేమి చేయలేమని చెప్పడంతో ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. అయితే తల్లికి వందనం పథకం అందకపోవడానికి విద్యుత్ శాఖాధికారులు నిర్లక్ష్యమే కారణమని, తనకు న్యాయం చేయాలని ఆమె అటు సచివాలయ అధికారులకు, ఇటు విద్యుత్ శాఖాధికారుల కార్యాలయానికి తిరుగుతూ ఉంది. ఇది ఒక్క కుమారికి మాత్రమే కాదు, నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోను ఇదే పరిస్థితి నెలకొంది. సోంపేట మండలంలోని పలు గ్రామాల్లో ఒక్కొక్కరి ఆధార్ నెంబర్‌కు పదుల సంఖ్యలో సర్వీసులు అనుసంధానం కావడంతో వారంతా పథకానికి అనర్హులుగా మారారు. జింకిభద్రతోపాటు మామిడిపల్లి, సోంపేట తదితర గ్రామాల్లో పలువురు ఇదే సమస్యతో అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సోంపేట పట్టణంలోని ఒక పాన్‌షాపు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్న వ్యక్తి ఇంటిలో ఒకరి ఆధార్‌కార్డుకి, మరో ఏడు సర్వీసులు అనుసంధానం చేశారు. దీంతో అతనికి సైతం తల్లికి వందనం సొమ్ములు పడలేదు. ఇలా ఇంతమంది నిరుపేదలు సమస్యతో అధికారులు చుట్టూ తిరుగుతుంటే దీనికి కారణమైన విద్యుత్ శాఖాధికారులు మాత్రం ఇదేమి తమ పని కాదన్నట్లు వ్యవహరిస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిరుపేద లబ్ధిదారులకు తల్లికి వందనం పథకం అందేందుకు శాఖాపరమైన ఇబ్బందులను తొలగించాలని సర్వత్రా కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

సమన్వయంతో యోగాంధ్ర విజయవంతం

- మార్కాపురం ఎమ్మెల్యే కందుల

ఆమదాలవలస, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సూచించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, కూటమి నాయకులతో ఆయన విశాఖలో నిర్వహించనున్న యోగా డేపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆకాంక్షను అర్థం చేసుకొని... అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలన్నారు. యోగాకు తరలించిన ప్రజలను తిరిగి ఇంటికి చేర్చే వరకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యోగా ప్రత్యేక అధికారి, మున్సిపల్ కమిషనర్ బాలాజీ ప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ కార్యదర్శి బోర గోవిందరావు, ఎన్‌టీఆర్ మెడికల్ ఇన్‌స్టిట్యూట్ కౌన్సిల్ మెంబర్ చాపర సుధాకర్, నాయకులు రెడ్డి రాంబాబు, తంగి గురయ్య, కూన రాము, శిమ్మ మాధవి, మున్సిపల్ అధికారులు, వార్డు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



జగతిమెట్ట లేఅవుట్

అక్రమాలు కొండంత.. చర్యలు గోరంత

(ఐదో పేజీ తరువాయి)

గుర్తించారు. 2019-24 మధ్యకాలంలో పనిచేసిన రెవెన్యూ అధికారులు, సిబ్బందిని సబ్‌కలెక్టర్ కార్యాలయానికి ఒక్కొక్కరుగా పిలిచి ఆర్డీవో విచారించారు. తహసీల్దార్ సంతకాలతో పాటు మిగిలిన సంతకాలు ఒక్కరే పెట్టి పొజిషన్ సర్టిఫికెట్లను కుప్పలుతెప్పలుగా అమ్ముకున్నట్లు నిర్ధారించారు. లేఅవుట్లకు సంబంధిచి జియో ట్యాగింగ్ వివరాలు కానీ, ఎంపికైన లబ్దిదారుల జాబితాలు కానీ, ఇళ్ల పట్టాలు జారీచేసిన రిజిస్టర్లు గానీ ఇలా ఏ ఒక్క వివరాలు కూడా తహసీల్దార్ కార్యాలయంలో లభించలేదు. ఆ రికార్డులు ఎప్పుడు మాయమయ్యాయో, ఎలా మాయమయ్యావో అంతుపట్టని ప్రశ్నగా మారింది. ఈ అక్రమాల్లో తహసీల్దార్, డీటీ, ఆర్‌ఐ, మండల సర్వేయర్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్, ముగ్గురు వీఆర్వోలను బాధ్యులను చేస్తూ వారి సస్పెన్షన్‌కు కలెక్టర్‌కు సిఫారసు చేస్తున్నట్లు ఆర్డీవో వెల్లడించారు. అయితే రోజులు గడుస్తున్నా వారిపై చర్యలు కానరాలేదు. ఈ విషయమై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను వివరణ కోరగా.. 'తప్పిదాలకు పాల్పడిన సిబ్బందిపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం. తహసీల్దార్ సస్పెన్షన్ అంశం సీసీఎల్ఏకు సిఫారసు చేస్తాం.' అని తెలిపారు.

మూడో రైల్వే లైన్‌కు గ్రీన్‌సిగ్నల్

(ఐదో పేజీ తరువాయి)

పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. రైల్వే, ప్రైవేటు ఆస్తులు గుర్తించే పనిలో ఉన్నారు. ఇచ్ఛాపురం నుంచి పలాస వరకూ 45 కిలోమీటర్ల పొడవునా ఎక్కువగా రైల్వే ఆస్తులే ఉన్నట్లు గుర్తించారు. సంబంధిత భూములు రైల్వే ఉద్యోగులకే లీజుకు ఇచ్చారు భారీ గోతులతో అవి ఉండడంతో ప్రస్తుతం అందులో వ్యవసాయం చేయడం లేదు. దీంతో రెవెన్యూ అధికారులకు భూ సేకరణ సులువైంది. కొన్ని చోట్ల ప్రైవేటు ఆస్తులు నష్టపోవాల్సి వస్తుంది. దీనిపై ప్రత్యామ్నాయ మార్గం అన్వేషించడం, లేదా వారికి నష్టపరిహారం చెల్లించి భూములు తీసుకోవల్సి ఉందని రెవెన్యూ అధికారులు చెబుతున్నా రు. భూసేకరణ పూర్తయితే, రెండేళ్లలో కొత్త రైలు మార్గం వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే విశాఖ డివిజన్‌లో పనులు చురుకుగా సాగుతున్నాయి. కొన్నిచోట్ల పట్టాలకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నారు. మూడో రైలు మార్గం ఏర్పడితే పూర్తిగా ప్రమాదాలు నివారించడానికి అవకాశం ఉంటుంది. దీంతో పాటు ఒక లైన్‌పై ప్రమాదం జరిగినా మూడో లైను మీదుగా రాకపోకలు సాగించవచ్చు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే పరిధిలో కార్గో రైళ్ల సంఖ్య అధికంగా ఉంది. అటువంటివి ఆగకుండా నేరుగా అనుకున్న చోటకు వెళ్లడానికి అవకాశం ఉంటుంది. సూపర్‌ఫాస్ట్ రైళ్లు కూడా ఒకే మార్గం ద్వారా వెళ్లడానికి అవకాశం ఉంటుంది.

యోగా సాధనతో ఆరోగ్యం

ఇచ్ఛాపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శారీరక ఆరోగ్యం కోసం యోగాను దినచర్యగా మార్చుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ అన్నారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బుధవారం యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సంజీవ్‌రెడ్డి యువతకు శిక్షణ ఇచ్చారు. యోగాకు సంబంధించిన పుస్తకాలను కమిషనర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర, ఎలియన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న స్థానికులు

మీరు మొక్కలు పెంచండి మేం నరికేస్తాం

- ఇదీ నగరంలో ప్రభుత్వ శాఖల తీరు
- ఓవైపు సందేశాత్మక చిత్రాలు.. మరోవైపు యథేచ్ఛగా చెట్ల తొలగింపులు





చెట్లను నరికి..కొమ్మలను అక్కడే వదిలేసిన దృశ్యం



గతంలో అదే చెట్ల నీడన సేదదీరుతున్న ప్రజలు

అరసవల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి)

ఈ చిత్రం చూడండి. ఓ బాలుడు మొక్కకు నీరు పోస్తున్న రంగు రంగుల చిత్రం గోడపై అందంగా కనిపిస్తోంది. ఈ చిత్రం చూడగానే మొక్కల ప్రాధాన్యం గుర్తుకువస్తుంది. మనమూ ఓ మొక్కను పెంచాలనే ఆలోచన కలిగిస్తుంది. ఆ బొమ్మ ఉద్దేశమూ అదే. ఆ పక్కనే ఎండిన తుప్పలను చూడండి. నిజానికి అవి తుప్పలు కాదు. ఇంతకుముందు అక్కడ ఉన్న ఓ చెట్టు కొమ్మలు కొట్టేయగా.. అవి ఎండిపోయి... అలా పడి ఉన్నాయి. నిన్నమొన్నటి వరకూ ఆ చెట్ల కింద ఎంతోమంది సేదదీరేవారు. అవి ఎందరికో నీడనిచ్చేవి. కానీ గొడ్డలివేటుకు బలైపోయాయి. ఓవైపు మొక్కలు పెంచాలని చెబుతున్న అధికారులు... చెట్లను నరికివేయిస్తున్నారు. విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్నాయని.. వాహనాలకు తగులుతున్నాయని.. ఇలా వివిధ కారణాలు చెప్పి వేటు వేస్తున్నారు. వాస్తవానికి విద్యుత్ తీగెలకు అడ్డంగా ఉంటే కొమ్మలు తొలగించాలి. కానీ ఇక్కడి సిబ్బంది ఏకంగా చెట్లనే తొలగిస్తున్నారు. దాదాపుగా నగరం మొత్తం అదే పరిస్థితి ఉంది. నగరంలోని ఆర్ట్స్ కళాశాల రోడ్డులోని గోడపైన ఈ చిత్రాలు.. ఆ పక్కనే ఎండిన కొమ్మలు కనిపిస్తున్నాయి. ఓవైపు జిల్లా వ్యాప్తంగా సుమారు 5లక్షల మొక్కలను పెంచాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. దీని కోసం సభలు.. సమావేశాలు.. అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. లక్ష్యాలను నిర్దేశిస్తున్నారు. మరో వైపు దీనికి భిన్నంగా పచ్చని చెట్లను తొలగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సి ఉంది.

గ్రంథాలయంపై అసత్య ప్రచారాన్ని నమ్మవద్దు

● ఏఏఐ సీఎస్ఆర్ నిధులతో ఆధునికీకరణ: జేసీ ఫర్మాన్‌అహ్మద్ ఖాన్

పాత శ్రీకాకుళం, జూన్18 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ప్రైవేటీకరిస్తారన్న అసత్యప్రచారాన్ని నమ్మవద్దని జేసీ ఫర్మాన్‌అహ్మద్ ఖాన్ ఒక ప్రకటనలో కోరారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అందజేసే కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో ఆధునికీకరించనున్నట్లు పేర్కొన్నారు.కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అభ్యర్థన మేరకు ఏఏఐ ముందుకొచ్చిందని తెలిపారు.రాష్ట్రంలోనే మోడల్‌గ్రంథాలయంగా తీర్చిదిద్దాలన్నలక్ష్యంతో అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. పాఠకుల కోసం సౌకర్యాలతో స్టేట్‌ఆఫ్ ఆర్ట్ గ్రంథాలయంగా అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు.ఈనిధులను జిల్లా పాలన యంత్రాంగమే వినియోగించనుందని, ప్రైవేటీకరణ ప్రస్తావనకే రాలేదని స్పష్టంచేశారు. గ్రంథాలయం పూర్తి స్థాయిలో ప్రభుత్వ యాజమాన్యంలోనే ఉంటుందని తెలిపారు.

డీఎస్సీకి 735 మంది హాజరు

ఎచ్చెర్ల,జూన్ 18(ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయ పోస్టుల నియామకానికి నిర్వహిస్తున్న డీఎస్సీపరీక్షలు ఆన్‌లైన్ విధానంలో కొనసాగుతున్నాయి. బుధవారం రెండుషిఫ్ట్‌ల్లో కలిపి చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజనీరింగ్ కళాశాలలో 565కు 538 మంది, ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో 200కు 197 మంది, మొత్తం 765కు 735 మంది హాజరయ్యారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

గార,జూన్18(ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మక్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకం నిర్వహణకు శ్రీకూర్మానికి చెందిన బరాటం నారాయణ ప్రసాద్, అనిత ఎమ్మెల్యే గొండు శంకర్ జన్మదినం పురస్కరించుకుని రూ.50 వేలు విరాళాన్ని ఈవో కె.నరసింహనాయుడుకు అందజేశారు. కార్యక్రమంలో నాగరాజు, సాంబశివరావు, ప్రభాకరరావు, నర్సుబాబు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నారాయణరావు

ఎచ్చెర్ల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.నారాయణరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమదాలవలస పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న నారాయణరావును ఇక్కడ నియమించారు. ఇప్పటి వరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన బి.జానకిరామయ్యను ఆమదాలవలసకు బదిలీ చేశారు.

కేజీకే కళాశాల ప్రిన్సిపాల్‌గా అన్నపూర్ణ

గార, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.మత్స్యలేశంలో గల కోకా వారి జూనియర్ కళాశాల(కేజీకే)ప్రిన్సిపాల్ వైవీఎల్ అన్నపూర్ణ బాధ్యతలు స్వీకరించారు. ఆమె వడ్డాది నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

కవిటి, జూన్18(ఆంధ్రజ్యోతి): ఉద్దానం ప్రాంతంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ పి.విజయ కోరారు. బుధవారం కవిటి మండలపరిషత్ సమావేశం ఎంపీపీ కె.పద్మ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా ఉద్దానంలో ఏగ్రామానికి సక్రమంగా నీరుసరఫరా కావడంలేదని విజయతోపాటుసభ్యులు బి.శ్రీరాంప్రసాద్,బి.ప్రకాష్, పి.నీలాచలం తెలిపారు.జలజీవన్ మిషన్ కింద ఇంటింటికి తాగునీరందించే పనులు పూర్తి కాలేదని పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్.రామారావు, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, డీటీ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రైతుల అడంగళ్లు సరిచేయండి

ఇచ్ఛాపురం, జూన్18(ఆంధ్రజ్యోతి): కేశుపురం పంచాయతీలో రీసర్వే పూర్తయినా 80శాతం మంది రైతుల అడంగళ్లు, 1బిలో తప్పులు ఉండడంతో రైతు భరోసా పడడం లేదని, వాటిని సరిచేయాలని బూర్జుపాడు ఎంపీటీసీ సభ్యుడు దున్న గురుమూర్తి కోరారు. బుధవారం ఇచ్ఛాపురంలో ఎంపీపీ బోర పుష్ప అధ్యక్షతన మండలసమావేశం జరిగింది. ఈ సందర్భంగా తల్లికివందనం పథకంలో అర్హులైన వారికి విద్యుత్ బిల్లులు ఎక్కువగా వచ్చాయని, భూములున్నాయని అనర్హులుగా గుర్తించడంతో పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలని పలువురు ఎంపీటీసీసభ్యులు కోరారు. వెలుగు ఏపీఎం ఎస్.ప్రసాద్ అవకతవకలకు పాల్పడడంతో విచారణ చేయాలని ఎంపీటీసీ ఎం.చక్రవర్తి కోరారు. ఈ విషయంపై కేశుపురం సర్పంచ్ ఢిల్లీరావు స్పందిస్తూ అధికారులపై ఆరోపణలు చేయడానికి ఇదివేదికకాదని, వేరే సమావేశాల్లో చర్చించుకోవాలని పేర్కొన్నారు. దీంతో చక్రవర్తి, ఢిల్లీరావు మధ్య వాగ్వాదం జరిగింది.దీంతో ఎంపీడీవో రామారావు కమిటీవేసి విచారణ జరుపుతామని హామీఇచ్చారు. అనంతరం పలు అంశాలపై చర్చజరిగింది. కార్యక్రమంలో ఎంపీడీవో రామారావు, ఎమ్మెల్సీ నర్తు రామారావు, జడ్పీటీసీ ఉప్పాడ నారాయణ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం టీడీపీ పట్టణాధ్యక్షుడిగా తవిటయ్య

ఇచ్ఛాపురం, జూన్ 18(ఆంధ్రజ్యోతి):ఇచ్ఛాపురం పట్టణ టీడీపీ కార్యవర్గ ఎన్నిక బుధవారం కవిటీ మండలంలోని రామయ్యపుట్టుగ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు మొదలవలస రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈమేరకు పట్టణాధ్యక్షుడిగా పత్రి తవిటయ్య, ప్రధానకార్యదర్శిగా నందిగాం కోటిఎన్నికయ్యారు. ఎన్నికైన వీరిద్దరికి ఎమ్మెల్యే, పార్టీ పరిశీలకులు అభినందించారు

నవధాన్యాల సాగుపై అవగాహన

ఆమదాలవలస, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చేపేనపేట యూనిట్ పరిధిలో ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో నవధాన్యాల విత్తనాల సాగు కార్యక్రమం బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సీడీఎఫ్ చేపేన సురేష్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి నక్క చిరంజీవి, కృష్ణవేణి పాల్గొన్నారు.

జొన్నలపాడులో భక్తి స్వరాంజలి

గార, జూన్ 18 (ఆంధ్రజ్యోతి):మండలంలోని జొన్నలపాడులో గల బృందావనంలో జ్యేష్ఠ బహుళ అష్టమి పురస్కరించుకుని బుధవారం రాత్రి భక్తి స్వరాంజలి కార్యక్రమంనిర్వహించారు. ఈసందర్భంగా గాయకులు మాధవి, యోజిత, సర్వాణి భక్తిగీతాలు అలపిస్తూ భజనచేశారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు చౌదరి శ్రీనివాస్, సింహాద్రి శ్రీనివాస్, వేణు గోపాల భక్తి స్వరాంజలి సభ్యులు పాల్గొన్నారు.

మడ్డువలస కాలువ పనులు పూర్తి చేయాలి

జి.సిగడాం,జూన్ 18(ఆంధ్రజ్యోతి):మడ్డువలస కుడి ప్రధాన కాలువ అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలని క్వాలిటీ కంట్రోల్ ఏఈ కె.విశ్వనాథ్, ఏఈ రాజశేఖర్ కోరారు. బుధవారం పెంట గ్రామపరిధిలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్‌లో ఆయకట్టుకు నీరందించేందుకుచర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.కార్య క్రమంలో యాజమాన్య సంఘం అధ్యక్షురాలు మీసాల విజయమ్మ పాల్గొన్నారు.

విద్యార్థిమిత్ర కిట్లు పంపిణీ

జి.సిగడాం, జూన్18(ఆంధ్రజ్యోతి):సంతవురిటి ఆదర్శప్రాథమిక పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను బుధవారం టీడీపీ నాయకుడు బాలబొమ్మ వెంకటేశ్వరరావు పంపిణీచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణరావు, వైస్ఎంపీపీ వెంకటరావు, నీటియాజమాన్య సంఘం అధ్యక్షుడు చినబాబు, పీఎంసీ అధ్యక్షురాలు దివ్య, హెచ్ఎం వి.విష్ణు పాల్గొన్నారు.

● కంచిలి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డిజిపురం పాఠశాలలో బుధవారం విద్యార్థులకు కిట్లు అందజేశారు.కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ ప్రఫుల్లా బిసాయి, మాదిన రామారావు, హరిబాబు, చినబాబు, భాస్కరరావు, పూర్ణ బిసాయి పాల్గొన్నారు.

130 మందికి కంటి వైద్య పరీక్షలు

రణస్థలం, జూన్ 18(ఆంధ్రజ్యోతి):రణస్థలంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సిబ్బంది బుధవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 130కి పరీక్షలు నిర్వహించగా 56 మంది శస్త్రచికిత్సకు ఎంపికయ్యారు.కార్యక్రమంలో సేవాఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు వెంకటసత్య నారాయణ, తిరుపతిరాజు, యశ్వంత్, కొన్ని వెంకటరావు పాల్గొన్నారు.

ప్రతినెలా పదో తేదీలోగా జీతాలు చెల్లించాలి

అరసవల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రతినెలా పదో తేదీలోగా జీతాలు చెల్లించాలని ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి కిరణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లాలోని వివిధ డిపో మేనేజర్లకు ఆర్టీసీఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 220 మంది ఔట్ సోర్సింగ్ కార్మికులకుఆర్టీసీ యాజమాన్యం కాంట్రాక్టర్ల ద్వారా జీతాలు చెల్లిస్తోందని తెలిపారు. సమస్యపై పలుసార్లు ప్రజా రవాణా అధికారి, కార్మికశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. కాంట్రాక్టర్లు అధికారుల ఆదేశాలను పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఈనెల 23 నుంచిప్రత్యక్ష ఆందోళన, నిరసన, ధర్నా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

అడుగడుగునా గోతులు.. అక్కడక్కడ మలుపులు

● ఇరువైపులా పిచ్చిమొక్కలు ● తరచూ ప్రమాదాలు ● ఇదీ కవిటి-ఇద్దివానిపాలెం రోడ్డులో పరిస్థితి



కొత్తపాలెం సమీపంలో బీలప్రాంతంలో రోడ్డుపై గోతులు ఏర్పడిన దృశ్యం

కవిటి, జూన్18 (ఆంధ్రజ్యోతి): కవిటి నుంచి తీరప్రాంత గ్రామాలను కలుపుతూ కవిటి- ఇద్దివానిపాలెం మీదుగా బొరివంక వరకు ఉన్న రోడ్డులో వాహనచోదకులు,ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. అడుగడుగునా గోతులమయంకావడంతోపాటు అక్కడక్కడ ఉన్న మలుపులు వల్ల తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

కవిటినుంచి తీరప్రాంతగ్రామాలను కలుపుతూ కవిటి-ఇద్దివానిపాలెం వరకు గల రహదారి నిత్యం రద్దీగా ఉంటోంది. వందలాది మంది మత్స్యకారులు సముద్రంలో సేకరించిన మత్స్యసంపదను పలాస, ఇచ్ఛాపురం తదితర ప్రాంతాలకు ఈ మా ర్గంలోనే తరలించాల్సిఉంది. ఈరోడ్డుకు ఒకవైపు గొనామరి గెడ్డ, మరోవైపు పంటపొలాలు ఉన్నాయి. దీంతో రోడ్డు ఇరుగ్గా ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించుకోలేని పరిస్థితి నెలకొంది. కవిటి బస్టాండ్ నుంచి ఉన్న ఈ రోడ్డులో మండలానికి చెందిన ప్రధాన కార్యాలయాలు ఉన్నాయి. దీంతో తరచూ ఇక్కడ ట్రాఫిక్ సమస్య తలెత్తు తోంది. కవిటి బస్టాండ్ నుంచి చింతామణి అమ్మ వారి ఆలయం వరకు రోడ్డుకు ఇరువైపుల ఆక్రమ ణల పుణ్యమాని కుదించుకుపోయింది. దీనికితోడు ద్విచక్రవాహనాలు, ఆటోల రద్దీ పెరగడం, రోడ్డుకు ఇరువైపుల పిచ్చిమొక్కల వల్ల ప్రతిరోజూ ఇక్కడ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

మరమ్మతులకు నోచుకోక

దశాబ్దాల కిందట నిర్మించిన కవిటి-ఇద్దివానిపాలెం రోడ్డు అధ్వానంగా మారినా ఏళ్ల తరబడి నిర్వహణ లేకపోవడంతోపాటు మరమ్మతులకు నోచుకోవడంలేదు. కొత్తపాలెం, చిన్నకర్రివానిపాలెం, బట్టివానిపాలెం గ్రామాల సమీపంలో రోడ్డు ఇరుగ్గా ఉన్నా, వెడల్పు చేయకపోవడంతో అగచాట్లు తప్పడం లేదని వాహనచోదకులు చెబుతున్నారు. ఈ రోడ్డులో చింతామణి అమ్మవారి ఆలయం వరకు, కొత్తపాలెం సమీపంలోని బీలబట్టి, పుక్కళ్ల పాలెం రోడ్డు సరిహద్దులోని మలుపు వద్ద ఏర్పడిన గోతుల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కవిటి-ఇద్దివానిపాలెం రోడ్డుకు ఆనుకొని సముద్రతీరానికి పుక్కళ్లపాలెం, కొత్తపాలెం మీదుగా వేసిన రోడ్లులో అడుగడుగునా రాళ్లు తేలిపో వడంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కవిటి-ఇద్దివానిపాలెం రోడ్డును మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

అవినీతికి పాల్పడితే వేటు తప్పదు

● దినసరి వేతనదారుడికి ఉద్వాసన పలకాలని ఆదిత్య ఆలయ ఈవో ఆదేశం

అరసవల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడితే వేటు తప్పదని ఆదిత్య ఆలయ ఈవో కేఎన్‌వీడీ ప్రసాద్ హెచ్చరించారు. అరసవల్లిలోని సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో ఈనెల 13న ఈవోగా బాధ్యతలు స్వీకరించిన ప్రసాద్ ఇక్కడి పరిస్థితులను చక్కదిద్దేందుకు నడుంబిగించారు.విధుల్లో చేరినప్పటి నుంచి ఆదిత్య ఆలయానికి సంబంధించిన అన్ని విభాగాలను పరిశీలిస్తున్నారు. సిబ్బందికి సూచనలిస్తూ ఉద్యోగులకు అప్రమత్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ప్రసాద విక్రయాలను పరిశీలించారు. ప్రసాదాల అమ్మకాల పరిశీలనలో 34 పులిహోర ప్యాకెట్లు తక్కువగా ఉండడం, నగదుకు సంబంధించి రూ.1000 తేడా కనిపించడంతో,అక్కడ పనిచేస్తున్న దినసరి వేతనదారుడిని విధుల నుంచి ఉద్వాసన పలకాలని ఆ విభాగం పర్యవేక్షిస్తున్న ఉద్యోగిని ఆదేశించారు. అవినీతికి పాల్పడితే దినసరివేతనదారుడైనా, శాశ్వత ఉద్యోగైనా వేటు తప్పదని హెచ్చరించారు. లడ్డూ, పులిహోర పరిమాణంలో తేడాలు ఉండరాదని, స్పష్టంచేశారు.

పారదర్శకంగా పథకాల అమలు

● ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్



మాట్లాడుతున్న అశోక్

కవిటి, జూన్18(ఆంధ్రజ్యోతి): పారద ర్శకంగా పథకాలను అమలుచేస్తున్నామ ని, లేనిపోని ఆరోపణలు చేయడం వైసీపీ నేతలకు తగదని ప్రభుత్వ విప్, ఇచ్ఛా ఎమ్మెల్యే బెందాళం అశోక్ హితవుపలికా రు.పాఠశాలలు తెరచినరోజునే తల్లికి వం దనం హామీని రాష్ట్రప్రభుత్వం అమలు చేసిందని తెలిపారు.బుధవారం రామ య్యపుట్టుగలో ఆయన విలేకరులతో మా ట్లాడుతూపాఠశాలల ఫీజుల కోసం అప్పు చేయాల్సిన అవసరం లేకుండా తల్లులకు అందించిన సొమ్ముతో కుటుంబసభ్యులం తా ఆనందంగా ఉన్నారన్నారు. ఖాతాలో రూ13వేలు జమచేసి పాఠశాలల అభివృద్ధికి రూ.రెండు వేలు కేటాయిస్తుంటే వైసీపీ నేతలు మాత్రం మంత్రి నారా లోకేష్‌పై దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారని, ఆరోపణలు చేసిన వారు వాటిని నిరూపించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో కవిటి మండల టీడీపీ అధ్యక్షుడు పి.కృష్ణారావు, కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బి.చిన్నబాబు పాల్గొన్నారు. కాగారామయ్యపుట్టుగలో రైతులకు విత్తనాల మినీకిట్లు ఎమ్మెల్యే అశోక్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ జగన్మోహనరావు, కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం, సోంపేట మండలాల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంతో పల్లెప్రగతి

గ్రామాల్లో రోడ్ల నిర్మాణంతోనే ప్రగతి సాధ్యమని ఎమ్మెల్యే బి.అశోక్ తెలిపారు. బుధవారం జగతిలో జగతి నుంచి బట్టివానిపాలెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనుకు శంకుస్థాపనచేశారు. సీసీరోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ పథకాలు అందించడమే కాకుండా రాష్ట్రాన్ని ముందుకుతీసుకువెళ్లేందుకు సీఎంచంద్రబాబుప్రయత్నిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు దాసరి రాజు, ఏఎంసీ చైర్మన్ మణిచంద్రప్రకాష్, పి.కృష్ణారావు, రమణ, బి.రమేష్, బి.చిన్నబాబు, పి.ప్రవీణ్, పి.జోగారావు పాల్గొన్నారు.

యోగాతోనే పరిపూర్ణ ఆరోగ్యం: ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): యోగాతోనే పరిపూర్ణ ఆరోగ్యం సాధ్యమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. బుధవారం శ్రీకాకుళంలోని 80అడుగుల రోడ్డులో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఆయుష్ శాఖల ఆధ్వర్యంలో యోగ నిర్వహించారు. ఈసందర్భంగా గత ఏడాది పాలనలో నియోజకవర్గంలో ఎమ్మెల్యే శంకర్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల సంచికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి పి.జగదీష్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ శిక్షకులు అమ్మన్నాయుడు, వి.సుధారాణి, కొఠారి రేణుక, నంబాళ్ల కల్పన, రాంబాబు, దేశళ్ల సురేంద్ర, గోవిందరావు, ఆదినారాయణ, శేఖర్, తంగి స్వాతి, కొంక్యాన మురళి, దుంపల చిన్నబాబు పాల్గొన్నారు.

ఈద్గా కోసం స్థలం మంజూరు చేయాలి



ఎండీ ఫరూక్‌కు ఎమ్మెల్యే శంకర్‌తోకలిసి వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం నాయకులు

అరసవల్లి,జూన్ 18(ఆంధ్ర జ్యోతి): ఈద్గా కోసం స్థలం మంజూరు చేయాలని శ్రీకాకుళంలోని ముస్లిం నాయకులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ యోగాం ధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం శ్రీకాకుళంలో పర్యటించారు.ఈ సందర్భం గా ఆయన్ను శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ కలి శారు. అనంతరం శ్రీకాకు ళంలోని ముస్లిం నాయకులు మంత్రికి వినతిపత్రం అందజేశారు.

నిరుద్యోగ భృతి ఇవ్వాలి

అరసవల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు రూ.3000 భృతిని ఇవ్వాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మొజ్జాడ యుగంధర్ డిమాండ్ చేశారు.ప్రభుత్వానికి ఐదు లక్షల అర్జీలను పంపనున్నామని తెలిపారు. ఈమేరకు బుధవారం శ్రీకాకుళంలోని పలుకోచింగ్ సెంటర్లలోనిరుద్యోగులతో దరఖాస్తులను పూరించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు లక్షల అర్జీలను సేకరించి ముఖ్యమంత్రి, గవర్నర్‌కు పంపిస్తామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను పూర్తిగా మోసం చేసిందని ఆరోపించారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవంగల చంద్రబాబునాయుడు రాష్ట్రంలో సంపద సృష్టి చేస్తానని, నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలను కల్పిస్తామని, నిరుద్యోగులకు నెలకు రూ.3000ల భృతిని అందజేస్తామని పేర్కొన్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్నశ్రీనివాస్, ఏఐవైఎఫ్ నాయకులు వై.వేణు పాల్గొన్నారు.

కంచిలిలో బోరు ఏర్పాటు

కంచిలి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కంచిలి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బోరు ఏర్పాటుచేశారు.ఈ మేరకు బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మాదిన రామారావు, డీటీ సంతోష్, ఆర్ఐ రౌలో, వీఆర్వో శ్రీను, చిన్నబాబు, ఆశిష్, మన్మథరావు పాల్గొన్నారు.

మోదీతో సర్వతోముఖాభివృద్ధి: ఎన్ఈఆర్

ఎచ్చెర్ల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీతో దేశం సర్వతోముఖాభి వృద్ధి సాధిస్తుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకు దిటి ఈశ్వరరావు తెలిపారు.బుధవారం మం డలంలోని కేశవరావుపేటలో మోదీ 11 ఏళ్ల పాలన పూర్తయిన సందర్భంగా వికసిత్ భారత్ సంకల్ప సభను నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి డాక్టర్ విశ్వక్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు షర్మిల పర్యటన

అరసవల్లి/ఇచ్ఛాపురం,జూన్18(ఆంధ్రజ్యోతి):జిల్లాలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల గురువారం పర్యటించనున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తారు. కార్యక్రమాన్ని నాయకులు విజయవంతం చేయాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పూడి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇచ్ఛాపురం, జూన్18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాలు, మునిసిపాలిటీపరిధిలోగల పలువార్డుల్లో సబ్‌స్టేషన్, లైన్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌ఈఈ యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మునిసిపాలిటీ పరిధిలోగల బెల్లుపడ, బెల్లుపడ కాలనీ, కంద్రవీధి, దాసన్నపేట, కస్పావీధి, డబ్బూరివీధి, ఏఎస్‌పేటతో పాటు మండలంలోని కేదారిపురం, ముచ్చింద్ర గ్రామాల్లోఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

వెన్నుపోటు పుస్తకావిష్కరణ

శ్రీకాకుళం అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలంలోని పెద్దపాడులోని మాజీ మంత్రి ధర్మానక్యాంప్ కార్యాలయం వద్ద వెన్నుపోటు పుస్తకాన్ని వైసీపీ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసీపీనాయకులు మామిడి శ్రీకాంత్, సూరిబాబు, మెంటాడ స్వరూప్, గేదెల పురుషోత్తం, తాతబాబు, అంబటి శ్రీనివాస్, గొండు రఘురాం పాల్గొన్నారు.

కులగణన చేపట్టాలి

శ్రీకాకుళం అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జనగణనతోపాటు కులగణన చేపట్టాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు టి.తిరుపతిరావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వెలువరించిన గెజిట్ నోటిఫికేషన్‌లో కులగణనపై స్పష్టత లేదని తెలిపారు. కులగణన భాగంగానే ఆయా కులాల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర అంశాలను పరిశీలించి గణనచేయాలని డిమాండ్‌చేశారు.ప్రతిపదేళ్లకు జరగాల్సిన జనగణన స్వాతంత్ర్యం వచ్చి ఇప్పటికి ఏడుసార్లు మాత్రమే చేశారని గుర్తుచేశారు. కులగణనను బీహార్, తెలంగాణ రాష్ట్రాల్లో నిర్వహించినట్లు తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శిగా మురళీధర్

ఆమదాలవలస, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలసకు చెందిన టీడీపీ నాయకుడు నాగళ్ల మురళీధర్‌యాదవ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. హైదరాబాద్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నియామకపత్రం అందజేశారు.

నిర్వహణ లేక.. శిథిలావస్థకు చేరి

● ఇదీ కె.మత్స్యలేశం బీచ్ సమీపంలో ఆర్అండ్‌బీ బంగ్లా పరిస్థితి



శిథిలావస్థలోఉన్న ఆర్అండ్‌బీ బంగ్లా

గార, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కె.మత్స్యలేశం బీచ్ ఎదురుగా బ్రిటీష్ కాలం నాటి ఆర్అండ్‌బీ బంగ్లా నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరింది.అప్పట్లో ఈ బీచ్‌ను సందర్శించేందుకు వచ్చే అధికారులు ప్రజాప్రతినిధులతోపాటు, పర్యాటకులు ఇక్కడ కొద్దిసేపు విశ్రాంతి తీసుకునేవారు. అప్పట్లో బీచ్‌ను కొంతవరకు అభివృద్ధిచేశారు.ఇక్కడ పదేళ్ల కిందట పర్యాటకశాఖ టూరిస్ట్ రిసార్ట్ నిర్మించింది. తర్వాత ఇక్కడిబంగ్లా నిర్వహణ లేకపోవడం, పర్యాటకులు ఆశక్తి చూపకపోవడం శిథిలావస్థకు చేరుకుంది.ఈబంగ్లా నిర్వహణ కోసం వాచ్‌మెన్ ఉండేవారు.చరిత్ర గలబీచ్‌ను సందర్శించే పర్యాటకులకోసం బంగ్లాను మరమ్మతులుచేయించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

ఉద్యోగులకు మెమోలు ఇవ్వండి

● పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే రవికుమార్

సరుబుజ్జిలి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విశాఖలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమానికి విధులు కేటాయించిన అధికారులు సమీక్షా సమావేశానికి గైర్హాజరు కావడంపై పీయూసీ చైర్మన్ ఎమ్మెల్యే రవికుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు.విధులపై నిర్లక్ష్యం వహిస్తున్న గ్రామ సచివాలయం ఉద్యోగులతోపాటు అధికారం లేకపోయినా వారికి వత్తాసు పలికిన పంచాయతీ కార్యదర్శులకు మెమోలు ఇచ్చి సంజాయిషీ కోరాలని ఎంపీడీవో ఎం.పావని ఎమ్మెల్యే ఆదేశించారు. బుధవారం సరుబుజ్జిలి మండలపరిషత్ కార్యాలయంలో ఈనెల 21న ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో విశాఖలోనిర్వహించనున్న యోగా దినోత్సవం కార్యక్రమంపై పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్‌తో కలిసి రవికుమార్ సమీక్షించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్య నారాయణ, టీడీపీ నాయకులురాంబాబు, తాడేల వెంకటరమణ, పల్లి సురేష్, తర్లాడ సురేంద్ర, నూక కోటేశ్వరరావు, నందివాడ గోవిందరావు, లావేటి పూర్ణరావు పాల్గొన్నారు.



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

'తల్లికి వందనం' వర్తింపజేయాలి

ఇచ్ఛాపురం, జూన్18(ఆంధ్రజ్యోతి):తల్లికి వందనం పథకం ఇంజనీరింగ్ కార్మికులతో పాటు పారిశుధ్యకార్మికులకు వర్తింపజేయాలని ఏపీ మునిసిపల్ వర్కర్స్‌అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సభ్యులు డిమాండ్‌చేశారు. బుధవారం మునిసిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రమేష్‌పట్నాయక్ మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో ఇబ్బందిపడుతున్న కార్మికులకుటుంబాలను ఆదుకోవాలనికోరారు. ప్రభుత్వపై ఒత్తిడితెచ్చి సంక్షేమపథకాలు అమలుచేయించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, పోరాటాలు నిర్వహించాలని యూనియన్ తీర్మానించిందని చెప్పారు.అనంతరం కమిషనర్ ఎన్.రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురంలో నిరసన తెలుపుతున్న కార్మికులు

నరసన్నపేట వెళ్లాలంటే రూ.15 అదనం

- ఇది చల్లవానిపేట కూడలి నుంచి టికెట్
- వంతెన నిర్మాణమైనా ధర తగ్గలే..
- ఆర్టీసీ అధికారుల తీరుపై విమర్శలు

జలుమూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట నుంచి చల్లవానిపేట కూడలికి ఆర్టీసీ చార్జి రూ.20. అదే చల్లవానిపేట నుంచి నరసన్నపేటకు వెళ్లాలంటే అదనంగా రూ.15 చెల్లించాల్సిందే. ఇదేంటి రూ.35 చెల్లించాలా అనుకుంటున్నారా.. ఇది అక్షర సత్యం.. ఒకే రూటులో ఎదురెదురుగా వసూలు చేసే ధర ఇది. దీనిని వసూలు చేస్తున్నది ఏ ప్రైవేటు సర్వీసులో అనుకుంటే పొరపాటే. నిత్యం ప్రజలకు సేవలందిస్తున్నామని ప్రచారం చేసుకునే ఆర్టీసీ అధికారుల తీరు. ఒకే రూటులో ఇలా ఒక్కో ధర వసూలు చేస్తుండడంపై ప్రయాణికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. వివరాలిలా ఉన్నాయి..

వంతెన నిర్మాణం పూర్తయినా..

తిలారు రైల్వేగేటు వద్ద వంతెన పనుల సమయంలో ఆర్టీసీ బస్సుల రూటును మార్చారు. పాతపట్నం నుంచి నరసన్నపేట వెళ్లే బస్సులను చల్లవానిపేట కూడలి నుంచి జర్జంగి మీదుగా, నరసన్నపేట నుంచి పాతపట్నం బస్సులు తిలారు మీదుగా తిప్పారు. ఇంతవరకు బాగానే ఉంది. ప్రయాణికుల సౌలభ్యం కోసం అనుకుందాం.. అయితే వంతెన పనులు పూర్తయి వారం, పది రోజులు కాగా నరసన్నపేట నుంచి వెళ్లే ఆర్టీసీ బస్సులు, లారీలు, ఇతర భారీ వాహనాలు అనధికారికంగా వంతెన పైనుంచి రాక పోకలు సాగిస్తున్నాయి. అయితే పాతపట్నం నుంచి నరసన్నపేట వెళ్లే ఆర్టీసీ బస్సులు మాత్రం చల్లవాని పేట నుంచి జర్జంగి మీదుగా రాకపోకలు కొనసాగిస్తున్నాయి. దీంతో అదనపు వ్యయం కావడమే కాకుండా సమయం కూడా వృథా అవుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. నరసన్నపేట నుంచి చల్లవానిపేట కూడలికి ఆర్టీసీ బస్సు చార్జీ రూ.20 వసూలు చేస్తున్నారు. చల్లవానిపేట కూడలి నుంచి జర్జంగి మీదుగా నరసన్నపేటకు అదనంగా రూ.15 కలిపి మొత్తం రూ.35 వసూలు చేస్తుండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో చాలామంది ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఆర్టీసీ అధికారుల తీరుతో తాము ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి టికెట్ విషయంలో తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. సమస్యను శ్రీకాకుళం డిపో-2 మేనేజర్ శర్మ దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకువెళ్లగా హైవే అధికారులు అనుమతివ్వాల్సి ఉందని, అనుమతి రాగానే తిలారు వంతెన పైనుంచి ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకుంటామన్నారు.



నరసన్నపేట నుంచి పాతపట్నం రూటులో వంతెన పైనుంచి వెళుతున్న ఆర్టీసీ బస్సు

వ్యాసరచన పోటీలో చాందిని ప్రతిభ


గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రంతో చాందిని

పాతపట్నం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో టీసీఎస్ 'ప్లాస్టిక్ పొల్యూషన్ రెమి డీస్, యూడింగ్ మోడర్న్ ఇండియా' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో రొంపి వలస జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని లుకలాపు చాందిని జూనియర్స్ విభాగంలో విజేతగా నిలిచిందని హెచ్‌ఎం నల్ల కుమార స్వామి తెలిపారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి లోనూ తన సత్తా చాటిందన్నారు. ఈ మేరకు ఈనెల 15న న్యూఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రం, రూ.35 వేల విలువైన బహుమతులను అందుకుందని తెలిపారు. రాష్ట్రం నుంచి పాల్గొని విజేతగా నిలిచిన చాందినిని బుధవారం పాఠశాలలో ఎంఈవో కె.గోవిందరావు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

పే స్కేల్ అమలు చేయాలి

పలాస, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకులకు తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని వీఆర్‌ఏల సంఘ నేతలు కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే గౌతు శిరీషకు ఆమె కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ.. అర్హత ఉన్న వీఆర్‌ఏలకు వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలన్నారు. ఏళ్ల తరబడి నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్‌ఏలుగా నియమించాలని కోరారు. అటెండర్, నైట్ వాచ్‌మెన్ ప్రమోషన్ కోటాను 20 శాతం నుంచి 70 శాతానికి పెంచాలని, అక్రమ డ్యూటీలను రద్దు చేయాలన్నారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ వీఆర్‌ఏల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు సీహెచ్ లక్ష్మణరావు, కార్యదర్శి బి.తిరుపతిరావు, సీహెచ్ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

తల్లి బ్యాంకు ఖాతాల్లో 'తల్లికి వందనం'

పోలాకి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఎంతమంది పిల్లలుంటే అందరికీ వారి తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం రూ.13 వేలు వంతున ప్రభుత్వం వేసిందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఈదులవలస మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో పుస్తకాలు, చెక్కీలపై కూడా మాజీ సీఎం జగన్ చిత్రాలను ముద్రించారని విమర్శించారు. ప్రస్తుతం అటువంటివి ఏవీ లేకుండా విద్యార్థులకు కిట్లు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ, విద్యాకమిటీ చైర్మన్ దండుపాటి ఎర్రయ్య, టీడీపీ సమన్వయకర్త బగ్గు అర్చన, టీడీపీ నాయకులు బైరి భాస్కరరావు, ఎంవీ నాయుడు, ఆర్కే నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు, హోర్డింగ్‌ల తొలగింపు



ఫ్లెక్సీలు తొలగిస్తున్న సిబ్బంది

నరసన్నపేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన మార్గాల్లో సెంటర్ డివైడర్లలో విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, పెద్ద హోర్డింగ్‌లను పంచాయతీ అధికారులు బుధవారం తొలగించారు. హోర్డింగ్‌లు, ప్రకటన బోర్డులను ఏర్పాటు చేయడం ద్వారా పలు జంక్షన్ల వద్ద ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో స్థానికుల ఫిర్యాదు మేరకు తొలగిం చినట్లు పంచాయతీ అధికారులు తెలిపారు.

వంశధార అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

నరసన్నపేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి వంశధార అధికారులు గైర్హాజరుకావడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేసారు. బుధవారం ఎంపీపీ ఆరంగి మురళి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. మండలంలో వంశధార కాలువల తీరుపై తమ బాధ చెప్పుకునేందుకు వంశధార అధికారులు రాకపోవడంతో సభ్యులు ధ్వజమెత్తారు. ప్రభుత్వ పథకాలపై ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో రేణుకాదేవి, తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులు అభివృద్ధి చెందాలి

మెళియాపుట్టి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు అన్ని విధాలా అభివృద్ధి చెందాలని ఎంపీడీవో ప్రసాద్‌పండా అన్నారు. బుధవారం సురిఖండి, భరణికోట పంచాయతీల్లో జన్ జాతీయ గౌరవ్ వర్ష్ వేడుకల్లో భాగంగా గ్రామసభలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం గిరిజనులను అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లేందుకు గ్రామసభల ద్వారా వివరాలు సేకరించడం జరుగుతోందన్నారు. ఆర్థిక స్థితిగతులు మెరుగుపరిచేందుకు ప్రణాళికలు తయారుచేయడం జరుగుతోందన్నారు. రైతులు నుంచి వ్యవసాయానికి ఆయిల్ ఇంజన్లు కావాలని దరఖాస్తులు వస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో దేవేంద్రరావు, మాజీ సర్పంచ్ ఎల్‌ఎం నాయుడు, జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.


సిరియఖండిలో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రసాద్ పండా

రూ.518 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి

- ఎమ్మెల్యే గౌతు శిరీష

వజ్రపుకొత్తూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పలాస నియోజక వర్గంలో రూ.518 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బుధవారం బెండి, నువ్వలరేవు, మంచినీళ్లపేటల్లో రూ.3.80 కోట్లతో చేపట్టిన జల్‌జీవన్ పనుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో మాజీ మంత్రి అప్పలరాజు ప్రచార ఆర్భాటాలే తప్ప ఏ ఒక్క అభివృద్ధి పని చేపట్టలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది లోనే రూ.518 కోట్లు నిధులు మంజూరు చేయించామన్నారు. గత ఐదుళ్ళల్లో రైతాంగానికి సాగు నీరు అందించలేకపోయారన్నారు. కాని తాను ఎమ్మెల్యేగా గెలిచిన 20 రోజుల్లోనే వంశధార నీటిని శివారు భూములకు అందించానన్నారు. నియో జకవర్గంలో సాగు, తాగు నీటి సమస్య లేకుం డా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వంశ ధార కాలువల్లో పూడికతీత చేపటామని, చెక్ డ్యాంల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ప్రతి ఇంటికి కుళాయి ద్వారా శుద్ధ జలాలను అందించేందుకు యుద్ధప్రాతిపదికన పనులు జరుగు తున్నట్లు చెప్పారు.

త్వరలో బెండి రోడ్డు పనులు

గత పాలకులు నిధులు విడుదల చేయక పోవడంతో బెండి రోడ్డు పనులు నిలిచిపోయాయని, సంబంధిత కాంట్రాక్టర్‌కు పెండింగ్ బిల్లులు చెల్లించి వచ్చే నెల 20 నుంచి పనులు ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, అగ్నికుల క్షత్రియ కార్పొ రేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, నువ్వలరేవు సర్పంచ్ పూర్ణ, మంచినీళ్లపేట మాజీ సర్పంచ్ గుల్ల చిన్నారావు, ఎంపీడీవో ఎన్.రమేష్ నాయుడు, మాజీ ఎంపీపీ గొరకల వసంతరావు, నేతలు ఎ.ఉమామహేశ్వరరావు, పి.సాంబమూర్తి, కణితి సురేష్ తదితరులు పాల్గొన్నారు.


జల్‌జీవన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

బీజేపీతోనే దేశాభివృద్ధి

మెళియాపుట్టి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ మాధవ్ అన్నారు. ప్రధానిగా మోదీ 11 ఏళ్ల దాటిన సందర్భంగా బుధవారం స్థానికంగా సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులందరిరీ పీఎం కిసాన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. ప్రపంచ దేశాలు భారత్ వైపు చూసేలా మోదీ పాలన సాగుతోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపు రపు తేజేశ్వరరావు, జిల్లామోర్చా అధ్యక్షుడు రాఘవ రావు, సలాన శరత్‌కుమార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దురదృష్టకర సంఘటన

హిరమండలం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక కూర్మ గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదం దురదృష్టకర సంఘటన అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ అన్నారు. కిట్టాలపాడు పంచాయతీ కూర్మ గ్రామంలో అగ్నిప్రమాద ఘటన జరిగిన హరేరామ హరేకృష్ణ మందిరాన్ని పరిశీలించారు. ఈ మేరకు అగ్ని ప్రమాద వివరాలను ఆశ్రమ నిర్వాహకుల నుంచి తెలుసుకున్నారు. ఆయనతో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు తదితరులున్నారు.


అగ్నిప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

వామ్మో.. కుక్కలు!



ఎల్.ఎన్.పేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన లక్ష్మీనర్సుపేట జంక్షన్‌లో కుక్కల స్వైరవిహారంతో వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం గుంపులుగా కుక్కలు సంచరిస్తూ వాహనాలను వెంబడిస్తున్నాయని, దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అలాగే నడిచి వెళ్లేవారిపై దాడి చేసి గాయ పరుస్తున్నాయని పేర్కొంటున్నారు. లక్ష్మీనర్సుపేట జంక్షన్‌తో పాటు రోటరీనగర్, కోవిలాం కాలనీ లు అలికాం-బత్తిలి ప్రధానరోడ్డుకు ఆనుకొని ఉండడంతో ఈ రోడ్డుపై గుంపులు గుంపులుగా కుక్కలు సంచరిస్తున్నాయని ద్విచక్ర వాహనాలను, కార్లను వెంబడిస్తున్నాయని ప్రయాణికులు భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

'యోగాంధ్ర'కు సమాయత్తంకండి

- ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈనెల 21న నిర్వహించనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు ప్రజలు సమాయత్తం కావాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో అధికారులు, నాయకులతో యోగాంధ్రపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి యోగాపై ఆసక్తి ఉన్న వారిని గుర్తించి విశాఖకు తీసుకురావాలని సూచిం చారు. టీడీపీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. పీఎం మోదీ, సీఎం చంద్రబాబునాయుడు పాల్గొనే యోగాంధ్ర కార్యక్రమం వరల్డ్ బుక్‌లో స్థానం సంపాదించనుందన్నారు. కార్యక్రమంలో యోగాంధ్ర మొబలైజేషన్ అధికారి, డీఎఫ్‌వో వేంకటేశ్వరరావు, నియోజవర్గ టీడీపీ సమన్వయకర్త బగ్గు అర్చన, కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయండి

పాతపట్నం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): విశాఖ తీరాన ఈనెల 21న జరగనున్న యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలతో కలిసి యోగాభ్యాసం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ యోగా దినోత్సవానికి ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. ఈ కార్యక్ర మానికి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో యోగాభ్యాసకులు పాల్గొనాలని కోరారు.

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌గా శివకుమార్



జలుమూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కరవంజ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌గా రఘుపాత్రుని శివకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన గణేష్ పట్నాయక్ జి.సిగడాం బదిలీ అయ్యారు. శివకుమార్ భామిని నుంచి ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

వ్యవసాయాధికారిగా రవికుమార్



జలుమూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయాధికారిగా కింజరాపు రవికుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏవోగా పనిచేసిన కె.సురేష్ కంచిలికి బదిలీ కాగా పాతపట్నం నుంచి రవికుమార్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను వ్యవసాయ సహాయకులు అభినందించారు.

కాలువ సమస్యతో ఇక్కట్లు


గల్లలపాడు కాలనీలో రోడ్డుపై నిలిచిన నీరు

వజ్రపుకొత్తూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గల్లలపాడు గ్రామ కాలనీలో ఏమాత్రం వర్షం కురిసినా నీరు నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కాలనీలో కాలువ సదుపాయం లేకపోవడంతో రోజుల తరబడి మురుగు, వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోతోందని వారు పేర్కొంటున్నారు. దీంతో పారిశుధ్య సమస్య ఏర్పడడంతో పాటు దోమలు, ఈగలు వ్యాప్తి చెంది వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అనేక పర్యాయాలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువల నిర్మాణం చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మెళియాపుట్టి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): తిడ్డిమి- మెళియాపుట్టి లైన్ మరమ్మతుల నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టెక్కలి ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పుద్దపద్మాపురం, సుందరాడ, లింగుపురం, చాపర గ్రామాల్లో విద్యుత్ ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పోలాకి పరిధిలో రేపు..

పోలాకి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా కొత్త లైన్ల ఏర్పాటుకు గాను శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టెక్కలి ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు, ఏఈ విశ్వేశ్వరరావు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆరోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పోలాకి, గొల్లలవలస, సంతలక్ష్మీపురం, తోటాడ కొండలక్కివలస, కింజరాపువానిపేట తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించాలని సూచించారు.

చల్లవానిపేట సబ్ స్టేషన్ పరిధిలో..

జలుమూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): చల్లవానిపేట విద్యుత్ సబ్ స్టేషన్ 11 కేవి అల్లాడ ఫీడర్ పరిధిలోనిగ్రామాలకు ఈనెల 20న శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు టెక్కలి ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అల్లాడ, సైరిగాం, రామదాసుపేట, కరవంజ, తమ్మయ్యపేట, పాగోడు, గొటివాడ తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రావివలస పరిధిలో..

టెక్కలి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రావివలస సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెయింటినెన్స్ పనుల నేపథ్యంలో టెక్కలి టౌన్-1 ఫీడర్, కె.కొత్తూరు, రావి వలస హెడ్‌క్వార్టర్, లింగాలవలస రోడ్డు, తలగాం, బన్నువాడ, టెక్కలిటౌన్-2, డివిజన్ ఆఫీస్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ప్రకటనలో కోరారు.

తులగాం ఫీడర్‌లో..

హిరమండలం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా శుక్రవారం తులగాం ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగిస్తున్నామని, అందువల్ల విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు టెక్కలి ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అందువల్ల ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు గొట్ట, తుంగతంపర, చొర్లంగి, కల్లట, జిల్లోడిపేట, భగీరథపురం, పిండ్రువాడ, ఎంఎల్‌పురం, అంబావల్లి, అక్కరాపల్లి, కిట్టాలపాడు తదితర గ్రామా లకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రేపు బాబా మందిర వార్షికోత్సవం

టెక్కలి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి మండలం చిన్నహరిశ్చంద్రపురం పంచధామ క్షేత్రంలో శుక్రవారం బాబా మందిర 16వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రత్యేక పూజలు, నారాయణసేవ, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

స్పాట్ వాల్యుయేషన్ నిలిపివేసిన అధ్యాపకులు

టెక్కలి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం పరీక్షా పత్రాల మూల్యాంకనాన్ని అధ్యాపకులు నిలిపివేశారు. విధులకు చెల్లించే రెమ్యునరేషన్, డీఏ పెంచాలని, ప్రత్యేకంగా అబ్జర్వర్‌ను నియమించాలని కోరారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ గోవిందమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యలను అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ దృష్టికి తీసుకువెళ్లాలని వారు కోరారు.

సమన్వయంతో విజయవంతం చేయాలి

నందిగాం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలో యోగాంధ్ర-2025 కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌పీవో గోపిబాల సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం, ఉన్నత పాఠశాలల్లో సచివాలయ నోడల్ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈనెల 21న నిర్వహించనున్న యోగా దినోత్సవంలో ప్రతి ఒక్క రూ పాల్గొనాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో కుమార్ పట్నాయక్, నోడల్ అధికారులు జి.నర్సింహులు, పి.శ్రీకాంత్ వర్మ, టి.రాజారావు, కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర యోగా పోటీలో చంద్రశేఖర్‌కు మూడోస్థానం


చంద్రశేఖరరెడ్డికి బహుమతి అందిస్తున్న రాష్ట్రమంత్రులు సత్యకుమార్, దుర్గేష్

టెక్కలి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా సోలో సాంగ్ పోటీలో యోగా గురువు గేదెల చంద్రశేఖరరెడ్డి మూడో స్థానం సాధించారు. ఈ మేరకు బుధవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో చంద్రశేఖర్‌కు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్, పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్ బహుమతులు అందించి అభినందించారు. రూ.20వేల నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపికను బహూకరించారు.


టెక్కలి: యోగాసనాలు వేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు



ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

డిగ్రీ కళాశాలలో యోగాంధ్ర

టెక్కలి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని సామూహిక యోగాసనాలు వేశారు. ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యోగాసనాల ప్రాముఖ్యతపై అధ్యాపకుడు కోటేశ్వరరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్‌కుమార్, లూక్‌పాల్, వాసుబాబు, డాక్టర్ పీవీఎన్ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన ర్యాలీ

నరసన్నపేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21 ప్రతి ఒక్కరూ యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనాలని కోరుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.లత, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.